ప్రజాశక్తి

ఉన్నత విలువలూ నేర్పించాలి

- ఇన్‌ఛార్జీ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య - ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

విద్యార్థులకు చదువుతోపాటు ఉన్నత విలువలు నేర్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం కర్నూలు నగరంలోని జడ్‌పి సమావేశ మందిరంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే విద్యార్థులకు అవసరమైన విద్యా బుద్ధులు నేర్పిస్తారని తెలిపారు. ఎంతో మంది ఉపాధ్యాయుల కృషితోనే తాను ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు వారికి నిర్దేశించిన సమయంలో విద్యార్థులకు విద్యను అందజేయాలన్నారు. విద్యార్థులకు అనుగుణంగా బోధన తీరును కూడా మార్చుకొని విద్యార్థులకు అవసరమైన విద్యను బోధించాలని తెలిపారు. అనంతరం జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యకు పెద్దపీట వేశారని తెలిపారు. విద్య నేర్చుకున్న విద్యార్థి కుటుంబానికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకొని రాగలరని చెప్పారు. ముఖ్యమంత్రి విద్యార్థులకు విద్యను ఆస్తిగా అందిస్తున్నారని తెలిపారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలే మార్చేశారని చెప్పారు. పాఠశాలలకు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సమాజంలో గౌరవమైన వృత్తి అంటే ఒక్క ఉపాధ్యాయ వృత్తేనని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యనందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాలలను మంచిగా తీర్చి దిద్దారని చెప్పారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పోషక విలువలు, నాణ్యత గల భోజనం అందిస్తున్నారని తెలిపారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపం ఉన్నవారికి కంటి అద్దాలను కూడా అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు నాణ్యత గల విద్యనందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులను కోరారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి కృషి చేశారన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. ఉపాధ్యాయులు కూడా ఎంతో దూర ప్రయాణాలు చేసి విద్యార్థులకు విద్యను బోధిస్తారని తెలిపారు. నగర మేయర్ బివై.రామయ్య మాట్లాడుతూ... డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో గురువు ఉంటారని, వారే విద్యార్థులకు క్రమశిక్షణతో మెలిగే విధంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. గతంలో కలెక్టర్ పి.కోటేశ్వరరావు అబ్బాయిని అంగన్వాడీ పాఠశాలలో చేర్పించారని చెప్పారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలో బల్లలు, బోర్డులు అవసరమైన మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉండేవి కాదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. డిఇఒ రంగారెడ్డి మాట్లాడుతూ... సర్వేపల్లి రాధాకృష్ణ జీవన ప్రయాణాన్ని ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకొని విద్యార్థులను భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. అనంతరం చూపరులను ఆకట్టుకునే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన 68 మంది ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానించి మెమొంటోలు అందజేశారు. జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి, సర్వ శిక్ష అభియాన్ పిఒ డాక్టర్ కె.వేణుగోపాల్, డైట్ ప్రిన్సిపల్ వసుంధర దేవి, డిప్యూటీ డిఇఒ, జిల్లాలోని ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న డిఇఒ రంగారెడ్డి

ఉపాధ్యాయులతోనే సమాజ మార్పు

- డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఉపాధ్యాయులతోనే సమాజ మార్పు సాధ్యమని డిఇఒ రంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రజాశక్తి దినపత్రిక ఆధ్వర్యంలో స్థానిక ఎంపిపి హాలులో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తికి స్ఫూర్తిగా నిలిచిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ స్ఫూర్తితో గురుపూజోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పేద ఉపాధ్యాయుడి స్థాయి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఆయన ఎదిగి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఉపాధ్యాయులను ప్రోత్సహించే దిశగా గురుపూజోత్సవం రోజున అవార్డులను ప్రదానం చేస్తున్నామని తెలిపారు. ఈ అవార్డులు ఉపాధ్యాయుల బాధ్యతలను మరింత పెంచుతాయని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం చైతన్యాన్ని నింపుతుందన్నారు. ఉత్తమ విద్యా బోధన కోసం మారుతున్న సమాజానికి అనుగుణంగా నూతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకొని బోధన సాగించాలన్నారు. అనంతరం ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జీ పానుగంటి చంద్రయ్య మాట్లాడుతూ... ప్రజాశక్తి దినపత్రిక వార్త రంగంలోనే కాకుండా సామాజిక బాధ్యతలను నిర్వర్తించడంలోనూ ముందుంటుందని తెలిపారు. విద్యారంగంలో ఎదురయ్యే సమస్యలను ఎత్తిచూపటమే కాకుండా సామాజిక సేవలోనూ ముందుంటుందని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజ్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్య బోధనేతర అంశాలను ఉపాధ్యాయులపై రుద్దుతోందని తెలిపారు. అవేవీ లెక్కచేయకుండా విద్యాబోధనలో వృత్తి బాధ్యతల్లో ఏమాత్రం వెనుక పడకుండా స్ఫూర్తివంతంగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అందుకు ఈ అవార్డులే నిదర్శనమన్నారు. ప్రజాశక్తి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను అతిథులు సన్మానించారు. ప్రజాశక్తి ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఎస్ఎస్ఎ ఎపిసి కె.వేణుగోపాల్, విద్యాశాఖ ఎడి శామ్యూల్ పాల్, ఎంఇఒలు విజయకుమారి, వనజ కుమారి, వినోద్ కుమార్, ప్రజాశక్తి జిల్లా ఇన్‌ఛార్జీ రాజు, స్టాఫ్ రిపోర్టర్ వినయ్ కుమార్, డివిజన్ ఇన్‌ఛార్జీ ఎల్లా గౌడ్, విలేకరులు చంద్రమోహన్, మునిస్వామి, యూసుఫ్ ఖాన్, సత్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది

వెంటనే మరమ్మతులు చేపట్టాలి

- పూలబజార్‌లో పైపులైన్ కోసం తవ్విన రోడ్డు
- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పూలబజార్‌లో పైపులైన్ కోసం తవ్విన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు అబ్దుల్ దేశాయి, మహ్మద్ షరీఫ్ డిమాండ్ చేశారు. రోడ్డును అలాగే వదిలేయడంతో నిత్యం రద్దీగా ఉండి ట్రాఫిక్‌తో సతమతమవుతున్నారని తెలిపారు. పూలబజార్‌లో రోడ్డును మనిషి లోతు గుంత తవ్వి వదిలేయడం వల్ల ద్విచక్ర వాహనదారులు, ఆటోడ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. షేక్షావలీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు వన్‌టౌన్ పోలీసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో, నగరపాలక సంస్థ సంబంధించిన కాంట్రాక్టర్ ఎక్కువమంది కార్మికులను పెట్టి రాత్రికి రాత్రే పనులు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యం వల్ల ప్రజలు, ద్విచక్ర, త్రీ చక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల్లో గుంతను తవ్వి పూడ్చకుండా వదిలేయడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కర్నూలు నగర కార్పొరేషన్ పరిధిలో జరిగే పనులన్నీ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేలా ఉన్నాయని విమర్శించారు. కమిషనర్‌కు నగరాభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలిపారు. ఉన్న డివైడర్లను పడగొట్టడం, మళ్లీ డివైడర్లు కట్టడం, డివైడర్‌లో ఉండే మన్నును, తీసేసి కొత్తగా మన్ను వేయడం చేస్తున్నారని చెప్పారు. మళ్లీ పాత చెట్లు తొలగించి కొత్త చెట్లు వేయడం, ఉన్న సర్కిల్‌ను పడగొట్టి మళ్లీ కొత్తగా సర్కిల్ కడుతున్నారని తెలిపారు. చెత్త పన్ను వసూలు చేయడంలో ఉన్న చిత్తశుద్ధి పూల బజార్‌లో గుంతను పూడ్చి వేయడంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. తక్షణమే పూల బజార్‌లో రోడ్డు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. గౌస్ బాషా, షేక్ అహ్మద్, రాజు, మన్యం, వలీ, నూర్ అహ్మద్, మహబూబ్ బాషా, రామాంజనేయులు, ఆకాష్, జహంగీర్ పాల్గొన్నారు.

పూల బజార్ వద్ద నిరసన చేపడుతున్న నాయకులు

అధిక ధరలను తగ్గించాలి

- సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ చార్జీలు, నిరుద్యోగం, అధిక ధరలను తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి లింగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజినేయులు, సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడారు. 100 రోజుల్లో ధరలు తగ్గిస్తానని చెప్పి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కారణమైందని విమర్శించారు. ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పిన బిజెపి ఇంతవరకు ఎలాంటి ఉద్యోగావకాశాలూ కల్పించలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్షలాది పోస్టులు ఖాళీ ఉన్నాయని, వాటిని భర్తీ చేయడం లేదని తెలిపారు. విద్యుత్ సంస్కరణల చట్టాన్ని తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలను మోపుతున్నాయని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను వీడి పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, మండల, పట్టణ నాయకులు రామాంజనేయులు, శేఖర్, బాష, హనుమంతు రెడ్డి, వీరేష్, నాగరాజు, వెంకటేష్, మునిస్వామి, రంగన్న పాల్గొన్నారు. **కోసిగి** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రుద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకులు వీరేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు హాజరయి మాట్లాడారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు, మండల నాయకులు కరెప్ప, పూజారి శ్రీనివాసులు, రామకోటి హనుమంతు, నాగేంద్ర, గోపాల్, ముక్కరన్న, చింతకుంట ఈరన్న, హనుమంతు, చింతకుంట ఈరన్న, దిలీప్, తాయన్న, లక్ష్మన్న, వెంకటేష్, రాము, ప్రకాష్ పాల్గొన్నారు. **కౌతాళం** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ వీరన్న, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వీరేష్, సిపిఎం నాయకులు వీరేష్, రామలింగ, వెంకటేష్, సత్యప్ప, వన్నూరు, రామాంజనేయులు, కేశవ, వీరేష్, శంకర్, వలీ పాల్గొన్నారు.

ఆదోనిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భవిష్యత్తు బాటలు వేసేంది గురువులే..

హారిజాన్స్ ఇంటర్ నేషనల్ ప్లే స్కూల్ ఛైర్మన్ ప్రదీప్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థుల భవిష్యత్ బాటలు వేయించేది గురువలేనని హారిజాన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో ఛైర్మన్ పి.ప్రదీప్ కుమార్ తెలిపారు. స్థానిక గణేశ్ నగర్‌లోని హారిజాన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో ఛైర్మన్ పి.ప్రదీప్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ కె.పావని ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ బాటలు వేయించేది గురువలేనని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయ వేషధారణలతో ప్రతి తరగతిలో పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరు ఎంతో ఆకట్టుకుందన్నారు. విద్యార్థినులు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా చీరలను ధరించి, అబ్బాయిలు పంచకట్టుతో తరగతుల్లో బోధించిన తీరును తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠ్యాంశాలు బోధిస్తున్న విద్యార్థి

మైపర్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని ఏ.క్యాంప్ నందు గల మైపర్ ఫార్మసీ కళాశాలలోఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. విద్యార్థులకు అధ్యాపకుల గొప్పతనాన్ని తెలియజేశారు. విద్యార్థులు అధ్యాపకులతో ఉన్న అనుబంధాన్ని, వారి చిన్ననాటి అధ్యాపకులను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులను సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేపల్లిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- రవీంద్ర టాలెంట్ స్కూల్స్ కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని రవీంద్ర టాలెంట్ స్కూల్స్ కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని మాధవి నగర్‌లో ఉన్న రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు, రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య మాట్లాడుతూ అధ్యాపకుడి నుంచి భారత రాష్ట్రపతిగా ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ స్థాయికి ఎదగడానికి ఉపయోగపడిన ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్య అతిథిగా విచేసిన విశ్రాంత ఉపాధ్యాయులు ఎంఆర్. మాణిక్య రావు మాట్లాడుతూ దేశ తొలి ఉప రాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా పని చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆ పదవులకే వన్నె తెచ్చారని చెప్పారు. సుదీర్ఘకాలం ఉపాధ్యాయ వృత్తిలో ఎందరికో పాఠాలు బోధించి, ప్రతి విద్యార్థి మనసులో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎంఆర్. మాణిక్యరావుని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఆధ్యాపకుల రూపంలో బోధించడం ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న పిబివి సుబ్బయ్య

ఆర్‌బికెలలో అందుబాటులో ఎరువులు : ఎఒ

ప్రజాశక్తి - సి.బెళగల్

మండలంలోని అన్నీ అర్బీకేలలో ఎరువులు, మందులు సిద్ధంగా ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ఏఒ మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని సంఘాల గ్రామంలో సిబ్బంది, అంజలి, సంధ్యారాణిల సమక్షంలో అర్బీకేను ఆయన తనిఖీ చేశారు. అక్కడ ఎరువులు, మందుల పంపిణీని పరిశీలించారు. ఈ ఖరీఫ్‌లో వర్షాభావం అయినప్పటికీ అధికారుల సలహాలు పాటించి ఎరువులను వాడాలన్నారు. ఈ రెండు రోజులలో కురిసిన వర్షాలు పంటలకు జీవమన్నారు. **మద్దికెర :** మద్దికెర మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఎరువులు వాడితే పంట దిగుబడి బాగా వస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో బసినేపల్లి, బురుజుల, హంపా, పెరవలి, అగ్రహారం, మద్దికేర రైతు భరోసా కేంద్రాలలో డిఎపి 6.5 టన్నులు, 14:35:14 రకం 11.4 టన్నులు, 20:20:0.13 రకం 26.5 టన్నులు, 28:28:0 రకం 21.1 టన్నుల ఎరువులు ఉన్నాయని తెలిపారు.

సి.బెళగల్ : ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న ఎఒ మల్లేష్

సాంస్కృతిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు నగరంలోని టిజివి కళాక్షేత్రంలో డ్యాన్స్, డ్రామా ఫెస్టివల్-2023 పోటీలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఈ పోటీలు ప్రతి రోజు సాయంత్రం 6:30 గంటల నుండి కళాక్షేత్రంలో జరుగుతాయి 'కూచిపూడి' యశోద, భరతనాట్యం మిస్ వంశీ మాధవి, మాధురి శ్రీ అమ్మయ్య బృందం అలరించంది. రాణిక పద్య నాటకం శ్రీకష్ణ కమలపాలిక పత్తి ఓబులయ్య బృందం, చెక్క భజన శ్రీమధు రామంజనేయ బందాలు అలరించాయి. కార్యక్రమానికి ముందుగా కర్నూలు మేయర్ బివై రామయ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

కృష్ణానగర్‌లో దొంగతనానికి గురైన ఓ షాపును పరిశీలిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఈ.పుల్లారెడ్డి

దొంగల నుండి ప్రజలకు రక్షణ కల్పించాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : కర్నూల్ నగరంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, దొంగల నుంచి రక్షణ కల్పించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఈ పుల్లారెడ్డి కోరారు. మంగళవారం తెల్లవారుజామున నగరంలోని కృష్ణానగర్ ప్రాంతంలో దొంగతనం జరిగిన హోటల్స్, మెడికల్ షాపులు, కిరాణం, జిరాక్స్ తదితర షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 2 నెలల్లో పదికి పైగా దొంగతనాలు జరిగాయని స్థానికులు తెలిపారన్నారు. చిరు వ్యాపారులకు సంబంధించిన రెండు షాపుల్లో నాలుగు గ్యాస్ సిలిండర్లు, ఒక గ్యాస్ స్టౌవ్, కొన్ని షాపుల్లో నగదు దొంగలు ఎత్తుకెళ్లారని చెప్పారు. పోలీసులు వేగంగా విచారణ జరిపి దొంగలను గుర్తించి, సామాన్లు, డబ్బును రికవరీ చేసి వ్యాపారులకు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతంలో గంజాయి సేవించి కొందరు ప్రజలను బెదిరించడంతోపాటు రైల్వే ట్రాక్‌పై వెళ్తున్న రైలు డ్రైవర్‌ను రాళ్లతో దాడి చేశారని స్థానికులు చెప్పారని, ఆ ప్రాంతంలో పోలీస్ గస్తీ ఏర్పాటు చేయడంతో పాటు అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర నాయకులు కే మధుసూదన్, శశి కుమార్ రెడ్డి, సివి వర్మ, షేక్ సెమివుల్లా, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఎంఇఒ-2 ఆదామ్‌బాషాకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి - సి బెళగల్

సి.బెళగల్ ఎంఇఒ-2 ఆదామ్ బాషా ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం కర్నూల్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డిలు ఎంఇఒ-2కు అవార్డు అందజేసి ఘనంగా సన్మినించారు. బెళగల్ మండలంలో నాణ్యమైన విద్యకు పాటుపడ్డారని ప్రముఖులు ఈ సందర్భంగా కొనియాడారు.

అవార్డును అందుకుంటున్న ఆదామ్ బాషా

అంధకారంలో ప్రభుత్వాస్పత్రి..

- మొద్దు నిద్రలో ప్రభుత్వం...



ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. రోగులు, పసిపిల్లలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నా విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు కనీస బాధ్యతను మరిచి మొద్దు నిద్ర పోతున్నారని సిపిఎం జిల్లా నాయకులు పి.గోవిందు విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. సాంకేతిక లోపం వల్ల సోమవారం ఉదయం 9 నుంచి ఆస్పత్రిలో విద్యుత్తు సౌకర్యం ఆగిపోయిందని తెలిపారు. వైద్యం కోసం వచ్చిన చిన్న పిల్లలు, గర్భిణులు, రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని చెప్పారు. చీకట్లో గాలి, వెలుతురు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒపి, ల్యాబ్ వద్ద మాత్రమే ఇన్వర్టర్లు ఉన్నాయని అన్నారు. ఎక్స్‌రే, కంటి పరీక్ష కోసం వచ్చిన రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సెల్‌ఫోన్ లైట్‌తో రోగులకు మందులు అందిస్తున్నారని చెప్పారు. ఏదైనా పొరపాటు జరిగితే ప్రాణాలకే ముప్పు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వాస్పత్రికి జనరేటర్ ఉన్నా అది మరమ్మతులో ఉందని తెలిపారు. కనీసం జనరేటర్‌నైనా వెంటనే మరమ్మతులు చేయించి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ బిల్లుల మోత ప్రజలు భరించలేకున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పటికే రెండింతల బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వచ్చే నెల నుంచి యూనిట్‌కు 40 పైసల చొప్పున పెంచడానికి ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. గతంలో చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీల పెంపు వల్ల ప్రజలు పది సంవత్సరాలు అధికారానికి దూరంగా ఉంచారని తెలిపారు. ఇప్పటికిప్పుడు విద్యుత్ బిల్లులు పెరిగితే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అదే గతి పడుతుందని హెచ్చరించారు.

పోషకాహారంతో రక్తహీనత నిర్మూలన

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

మహిళలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రసూన

బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, పోషకాహారం తీసుకుంటే రక్తహీనతను నిర్మూలించ వచ్చని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. మంగళవారం నగరడోన పంచాయతీలోని మజరా గ్రామమైన తిమ్మాపురంలో అంగన్వాడీ టీచర్ అనురాధ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రసూన హాజరయి రక్తహీనత నిర్మూలించేందుకు మహిళలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారపు అలవాట్లు చేసుకోవాలన్నారు. గుడ్డు, ఆకుకూరలు, పాలు, క్యారెట్, బీట్‌రూట్, కందగడ్డ, మొలకెత్తిన విత్తనాలు తీసుకుంటే రక్తం వృద్ధి చెంది పిల్లలు ఆరోగ్యంగా పుట్టడానికి దోహదం చేస్తాయన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహార కిట్లను తీసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంట్లోనూ పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని కోరారు. వెలుగు సిసి రాధ, సిఆర్‌పి రంగమ్మ, పుష్ప, ఆయా చిట్టెమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులే కీలకం

- సర్పంచి అయ్యమ్మ, ఇన్‌ఛార్జీ ఇఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి - కోసిగి

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర వహిస్తారని కోసిగి సర్పంచి ఎస్.అయ్యమ్మ, ఇన్‌ఛార్జీ ఇఒ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇన్‌ఛార్జీ ఇఒ చంద్రశేఖర్, వైసిపి సీనియర్ నాయకులు మాణిక్యరాజు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర వహిస్తారని తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని చెప్పారు. మొత్తం 45 మందికి సబ్బులు, నూనెలు అందజేశారు. వార్డు సభ్యులు ఈరన్న, వైసిపి యువ నాయకులు రాజేష్, సిబ్బంది శీను, హుస్సేని, మధు, రామకృష్ణ, రామాంజి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె అందజేస్తున్న ఇఒ

సమయపాలన పాటించని సిబ్బంది..

- చోద్యం చూస్తున్న అధికారులు.. - 11 గంటలైనా తెరచుకోని సచివాలయం

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల ఇంటి వద్దకు పాలన అందిస్తున్నామని ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పకుంటోంది. మరోవైపు సచివాలయ సిబ్బంది మాత్రం సమయపాలన పాటించడం లేదు. సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారన్న విమర్శలున్నాయి. సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సచివాలయ సిబ్బంది 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా ఉంది.

మండలంలోని చెల్లెల చెలిమల గ్రామ సచివాలయ సిబ్బంది మంగళవారం ఉదయం 11 గంటలైనా హాజరు కాకపోవడంతో సచివాలయ తలుపులు తెరచుకోలేదు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిన సిబ్బంది 'ఎప్పుడు వస్తారో' అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. 12 గంటల సమయంలో డిజిటల్ అసిస్టెంట్ మాధవిలత మాత్రం విధులకు హాజరయ్యారు. చేయూత దరఖాస్తుకు వచ్చిన గ్రామస్తులు సచివాలయ సమీపంలోనే ఉన్న ఓ ఇంట్లో సిబ్బంది ఉంచిన సచివాలయ తాళాలను తీసుకుని సచివాలయ తలుపులు తెరిచారు. సమయ పాలన పాటించని సచివాలయ సిబ్బందిపై సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెరచుకోని సచివాలయం

ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం....

ప్రజాశక్తి-ఆలూరు

భారత తొలి ఉప రాష్ట్రపతి జయంతి సందర్భంగా ఆలూరు గ్రంథాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎన్‌పి.వీరస్వామి, హెచ్.దేవదానం, మాజీ సైనికుడు ఎస్‌బి.నర్సిరెడ్డి హాజరయి మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణ తమిళనాడులో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ భారత మొదటి ఉప రాష్ట్రపతిగా నియమితులయ్యారని తెలిపారు. విద్యార్థులకు బోధించే వ్యక్తి మహోన్నతమైన పదవి చేపట్టి ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. ఋజీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు సతీష్ పాల్గొన్నారు.

'గాజులదిన్నె'కు నీటి చేరిక

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టులోకి నీరు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల నీటి చేరికతో ప్రాజెక్టు నీటిమట్టం పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్టులోకి నీరు చేరడంతో 371.98 నుంచి 372.49 మీటర్లు నీటిమట్టం చేరి అర మీటర్ మేర పెరిగిందని ప్రాజెక్టు జెఇ చిన్న అలీ మంగళవారం తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం నీటిమట్టం 1.25 టిఎంసిలుగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఆర్‌డిటి కొత్త కాలనీలో రోడ్లు వేయాలి

- ఎంపిడిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలం ఎరిగేరి గ్రామంలో ఆర్‌డిటి కొత్త కాలనీలో రోడ్లు వేయాలని సిపిఎం నాయకులు కోరారు. మంగళవారం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు కె.మల్లయ్య, మండల నాయకులు ఎరిగేరి వీరేష్, మేలిగిరి ఈరన్న మాట్లాడారు. ఆ కాలనీలో వర్షం వస్తే నడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పిల్లలు, వృద్ధులు గుంతలో పడిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఆ ప్రాంతం నల్లరేగడి భూమి కావడం వల్ల బురద, బురదగా, గుంతలు ఉన్నాయని చెప్పారు. ఆ ప్రాంతాల్లో విద్యుత్ లేకపోవడం వల్ల చీకట్లో చాలామంది నీళ్లలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఆర్‌డిటి కాలనీలో రోడ్లు వేయాలని, లేకపోతే తాత్కాలికంగా గరుసు అయినా వేయాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

వివాహ వేడుకల్లో ప్రదీప్ రెడ్డి

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రదీప్‌రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన రిసెప్షన్‌కు వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్ రెడ్డి హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంగళవారం బొంబాయి శివ సోదరుడు, బొంబాయి ఈరన్న కుమార్తె వరలక్ష్మి, సురేష్ రిసెప్షన్‌కు వచ్చిన ప్రదీప్‌రెడ్డిని, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డిని బొంబాయి శివ శాలువా, పూలమాలలతో ఆహ్వానించారు. పెట్రోలు బంక్ శీను ఉన్నారు. సిఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు వేణుగోపాల్ రాజు, కిరణ్ పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రం సుభిక్షం

- తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి తెలిపారు. మంగళవారం కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఎన్‌టి.రామారావు విగ్రహావిష్కరణకు హాజరైన చంద్రబాబు నాయుడును మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో యువ నాయకులు మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి కలిశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం రావణకాష్టంగా మారుతుందని తెలిపారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని చెప్పారు.

ఉరుకుంద లో హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ వాణి మాట్లాడారు. స్వామి వారికి రూ.79,75,355 నగదు, బంగారు వస్తువులు 15 గ్రాములు, వెండి వస్తువులు 13 కిలోల 250 గ్రాములు సమర్పించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థాన పాలక మండలి ఛైర్మన్ నాగరాజు గౌడ్, పాలకమండలి సభ్యులు, ఆదోని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, దేవస్థాన పర్యవేక్షకులు రామ్మోహన్, మల్లికార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆశాలపై అణిచివేత తగదు

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆశావర్కర్లపై అణిచివేత తగదని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి తెలిపారు. హర్యానా రాష్ట్రంలో ఆశావర్కర్లపై జరిగిన లాఠీచార్జీలు ఆ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ చర్యకు దర్పణం పడుతుందని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా డే సందర్భంగా నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేశారు. భవిష్యత్తులో ఆశా వర్కర్లపై ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సంఘీభావంగా ఆశా వర్కర్ల అందరికీ నిలవాలని కోరారు. రంగ లక్ష్మి, లింగమ్మ, రాణి, జయమ్మ, వీరేషమ్మ, అనసూయ, నాగమణి, సరస్వతి, శేషమ్మ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపడుతున్న ఆశావర్కర్లు

సంక్షేమం, అభివృద్ధి బాబుకు రెండు కళ్లు

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

సంక్షేమం, అభివృద్ధి టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు కళ్ల లాంటివని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ తెలిపారు. మంగళవారం ఆదోనిలోని తిరుమల నగర్‌లో జోరు వానలో కూడా మూడో రోజు 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. మినీ మేనిఫెస్టోను వివరిస్తూ మహిళలకు సంబంధించిన మహాశక్తి పథకాల గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. అన్నదాత పథకం కింద రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం, మహాశక్తి పథకం కింద ప్రతి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన మహిళలకు స్త్రీనిధి కింద నెలకు రూ.1500 అందజేస్తామని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు అందిస్తామని చెప్పారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తామన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికీ 'యువగళం నిధి' కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని తెలిపారు. ఆదోని మాజీ ఎంపిపి మురళీ, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, బీసీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వడ్డెమాన్ గోపాల్, గుడిసె లక్ష్మయ్య, సాధిక్ వలీ, జిల్లా తెలుగు యువత నాయకులు గుడిసె రామకృష్ణ, భరత్ కుమార్, పెద్దతుంబలం శీను, టిడిపి మండగిరి నాయకులు జమ్మన్న, నాగేంద్ర, బాబురావు, చిరంజీవి, పెద్దతుంబలం నర్సప్ప, ఇందిరానగర్ వీరేష్ పాల్గొన్నారు.

నందవరం : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో ద్వారా బడుగు, బలహీన ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, తాలూకా క్లస్టర్ ఇన్‌ఛార్జీ మాధవ రావు దేశాయి తెలిపారు. నందవరంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై వివిధ కాలనీల్లో పర్యటించి, పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలను సంపన్నులను చేసేందుకు ఐదేళ్లలో రెట్టింపు ఆదాయానికి టిడిపి గ్యారెంటీ అని తెలిపారు. ఈరన్న, శ్రీనివాసులు, మల్లికార్జున, పెద్ద మల్లికార్జున, చాంద్ బాషా, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదోనిలో మేనిఫెస్టోను వివరిస్తున్న గుడిసె కృష్ణమ్మ

నందవరంలో మేనిఫెస్టోను వివరిస్తున్న మాధవ రావు దేశాయి

విద్యార్థుల భవిష్యత్తు దిక్సూచి గురువు

- నేషనల్, జిఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల భవిష్యత్తుకు గురువు దిక్సూచీలా పని చేస్తారని నేషనల్, జిఎస్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ గోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని నేషన్ స్కూలులో గురుపూజోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... గురువులు చూపిన మార్గాన్ని విద్యార్థులు అనుసరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తించే వ్యక్తి ఒక్క గురువేనని చెప్పారు. సత్యశ్రీ పాల్గొన్నారు. అలాగే తిరుమల నగర్‌లో ఉన్న అమరావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉపాధ్యాయులను కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ శాలువా, పూలమాలలతో సన్మానించారు. అంతకుముందు రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సాయి భారతి పాఠశాలలో ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు నాగభూషణం, రత్నమయ్య, దుర్గేష్, శకుంతల, గిరిబాబు, పరిమళకు పూలమాల, శాలువాతో సన్మానించారు. అవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్త, కార్యదర్శి మిరియాల శ్రీధర్, ఉపాధ్యక్షులు ఈరన్న శెట్టి, రంగ, రఘు, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు సంగీత, మమతశ్రీ, బిందు ఉన్నారు. **దేవనకొండ** ఎఫ్ఆర్ హైస్కూల్‌లో విశ్రాంత ఉపాధ్యాయులు కూసురు కృష్ణయ్య, ఆయన సతీమణిని కరస్పాండెంట్ పి.రఘునాథ్, ప్రధానోపాధ్యాయులు బి.ఉచ్చిరప్పలు శాలువా, పూలమాల వేసి, నూతన వస్త్రాలు అందజేసి సన్మానించారు. ఉపాధ్యాయులు గోపాల్, రంగస్వామి, పాండురంగడు, వసంతకుమారి, లక్ష్మీ, వీర ప్రకాష్, శ్రావణి, తారామణి పాల్గొన్నారు. **దేవనకొండ**లోని శ్రీజ్ఞాన సుధా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ కె.సుధాకర్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. **హొళగుంద** మండలంలోని ఎల్లార్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా బి.లక్ష్మీకాంత అనే పూర్వ విద్యార్థి పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులకు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ప్రయాణంలో సురక్షిత పాటించుటకై హెల్మెట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ, జిలాని బాష, హరికృష్ణ, మూస పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని దీక్ష జూనియర్, రావూస్ డిగ్రీ కళాశాలలో సిఇఒ తిరుమల రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ ఫయాజ్ బాష అధ్యక్షతన మండలంలోని గుడికల్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఆరన్ జ్యోతి, మల్లికార్జున, రంగ స్వామి, విజయ్ కుమార్, బసన్నకు సన్మానం చేశారు. **ఆస్పరి**లోని నారాయణ ప్రైమ్ స్కూల్‌లో కరస్పాండెట్ నరేష్ ఆచారి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు స్వీట్లు అందజేశారు. ఉపాధ్యాయులు దీప్తి, సతీష్ కుమార్, జ్యోత్స్న, అంజి, ఈశ్వర్, గాయత్రి, రేష్మా, అంజినమ్మ, పద్మావతి, శ్రీదేవి, గంగమ్మ పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య, ఉపాధ్యాయులు డాక్టర్ వీరేష్ రావు, విఠోబరావు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఆదోని అమరావతి స్కూల్‌లో...

జిఎస్ఆర్ స్కూల్లో సంబరాలు చేసుకుంటున్న సిబ్బంది



దేవనకొండలో గురువులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ రఘునాథ్

ఆస్పరిలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

ఎమ్మిగనూరు 'రావూస్'లో నివాళులర్పిస్తున్న సిబ్బంది

పకడ్బందీగా ఓటరు జాబితా : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని

తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆదోని నియోజకవర్గంలోని రూరల్/అర్బన్ బిఎల్ఒలకు, ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఫామ్-6లోని నూతన ఓటర్ల కోసం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఫారం-7లోని ఓటరు తొలగింపు సంబంధించిన కచ్చితమైన ఆధారాలను సేకరించాలన్నారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు

- ఇన్‌ఛార్జీ కలెక్టర్ మౌర్య, డిఇఒ రంగారెడ్డి చేతులమీదుగా అవార్డు అందజేత

ప్రజాశక్తి - విలేకరులు

జిల్లాలో పలువురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి ఇన్‌ఛార్జీ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఇఒ వి.రంగారెడ్డి అవార్డులను అందజేశారు. అవార్డు రావడం మరిచిపోలేదని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. తోటి ఉపాధ్యాయుల సహకారం మరువలేనిదని తెలిపారు.

నందవరం ఎంఇఒ సుదర్శన్ రెడ్డికి ఉత్తమ మండలాధికారిగా అవార్డు వచ్చారు. కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. **చిప్పగిరి** చిప్పగిరి కెజివిబిలో పనిచేస్తున్న నీలిమకు అవార్డు వచ్చింది. నీలిమకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు. సర్వశిక్ష అభియాన్ ఎపిసి డాక్టర్ వేణుగోపాల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. **దేవనకొండ** కస్తూరిబా బాలికల పాఠశాల ప్రిన్సిపల్ సునీత ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. డిఇఒ రంగారెడ్డి, సర్వశిక్ష అభియాన్ అధికారుల చేతులమీదుగా ప్రశంసా పత్రం, అవార్డు అందుకున్నారు. **గోనెగండ్ల** మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆరెకటిక నాగేశ్వరరావు అవార్డు అందుకున్నారు. నాగేశ్వరరావు మండలంలోని పెద్దమరివీడు ఎంపియుపి పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. నాగేశ్వరరావు వృత్తిని, కవిత జిజ్ఞాసను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. డిఇఒ రంగారెడ్డి, ఎస్ఎస్ఎ ఎపిసి వేణుగోపాల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందడం పట్ల యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామన్, యు.చంద్రపాల్ అభినందనలు తెలిపారు. **ఆలూరు** 4వ వార్డు పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.జంబులింగయ్య ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనకు ప్రశంసాపత్రం, అవార్డును డిఇఒ రంగారెడ్డి, సర్వశిక్ష అభియాన్ అధికారి వేణుగోపాల్ అవార్డు అందజేశారు. **ఆదోని** ఐజల అమలానాథన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. అవార్డు రావడం పట్ల ఆది భారతీయ సామాజిక సేవా సంస్థ సభ్యులు ప్రేమ్ కుమార్, మహాదేవప్ప, తిప్పన, భాస్కర్ అభినందనలు తెలిపారు.

నందవరం ఎంఇఒ

చిప్పగిరి నీలిమ

దేవనకొండ సునీత

గోనెగండ్ల : అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

ఆదోని : అవార్డు అందుకుంటున్న అమలా నాథన్